# వేడి వెన్నెల

– కిరణ్



ఒకటే ప్రశ్న... ... బ్రతుకెందుకు?

అవునెందుకు బ్రతకటం!

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగల్గే వాడికి మామూలు బ్రతుకునుంచి దూరమవటం ఒక్కటే మార్గమవుతుంది

అది వేదాంతం.

○ ○ ○

రాత్రి పదైంది. దూరం నుంచే కారు శబ్దం విని గూర్ఖా హడావిడిగా పరుగెత్తి గేటు బార్లా తెరిచాడు. అప్పుడే నిద్రలోకి జారుతున్న బొచ్చు కుక్క మెలుకువ తెచ్చుకొని తోకాడించుకుంటూ వచ్చింది. అతడు కారు దిగి తన సంపదకు, ప్రతిష్ఠకు చిహ్నమైన తన యింటివైపు చూసాడు. దాన్ని చూసినపుడల్లా అతడికి ఆత్మ విశ్వాసం మరి కొంచెం పెరిగినట్లు వుంటుంది.

సెక్రటరి పిలుపుతో అతడు ఈ లోకంలోకి వచ్చాడు. బొంబే నుంచి ట్రంక్ కాల్ అట . తను యింటికి వచ్చినట్లు అప్పుడె యెలా తెలిసిందో! క్షణం ఆలస్యం చెయ్యకుండా ఆఫీసు

రూంలోకి నడచి ఫోన్ అందుకున్నాడు. అతడు బిజినెస్‌ను ఎప్పుడూ అలక్ష్యం చేయడు-అందుకే ఈ రోజు యీస్థాయికి యెదిగాడు. ఈ పరుగు పందెంలో క్షణ కాలం ఆలసిస్తే వెనుకవాడు కొన్ని రోజులు ముందుకు వెళ్ళిపోతాడు.

దాదాపు గంటన్నర సేపు అవసరమైన పేపర్లు చూసి చేయవలసిన సంతకాలు చేసి సెక్రటరీని పంపేసి అతను లేచి బద్ధకంగా వళ్లు విరుచుకున్నాడు. ఒక క్షణం కిటికీదగ్గర ఆగాడు. దూరంగా గేటు కిరువైపులా వున్న బోగన్‌విల్లాలు, వాటిని తలదించి చూస్తున్నట్లున్న అశోక వృక్షాలు-అవికూడా తనతోపాటే విస్తరించాయి. కాళ్ళకింద కార్పెట్ మెత్తగా తగుల్తోంది. వేసవికాలమే అయినా వేడి తెలియనీయకుండా ఎయిర్ కండిషనర్-అన్నీ వున్నా అతనికింకా యేదో కావాలనిపిస్తోంది.

మెట్లెక్కి తన గదిలోకి వెళ్ళబోతూ ఆగి పిల్లల గదిలోకి తొంగి చూసాడు. పడుకొనేముందు వాళ్ళిద్దర్నీ ఒకసారి చూసుకోవడం అలవాటు. బెడ్‌రూమ్‌లో అతడి భార్య గాఢనిద్రలో మునిగివుంది ఆమెకు నిద్రాభంగం కల్గించటం యిష్టం లేక అతడు ప్రక్కగదిలోకి వెళ్ళాడు.

అతనికి ఆ అర్ధరాత్రి స్నానం చెయ్యాలని యెందుకో బుద్ధి పుట్టింది. షవర్‌తో స్నానం చేసి నైట్‌డ్రెస్ వేసు కొంటూంటే వంటవాడు ట్రేలో భోజనం తెచ్చి పెట్టాడు. భోజనం పూర్తి కావించి పక్కమీద వాలేడేగాని నిద్రపట్టడం లేదు ఏదో మర్చిపోయిన భావన. ఏం మర్చిపోయాడు తను? ఏదో మర్చి పోయాడు ఏం మర్చిపోయాడు?

ఏం మర్చిపోయాడ.?

పక్కమీదనుంచి లేచి బల్లదగ్గర కూర్చుని టేబుల్ లాంప్ వెలుగులో మళ్ళీ కాగితాలన్నీ వరసగా చూసి, తను మర్చిపోయింది అందులో లేదని గమనించి మళ్ళీ పక్కమీద వాలాడు. రోజూ మేనువాల్చగానే నిద్రపోయేవాడు. ఈరోజు యెంతకీ నిద్ర రావడంలేదు. అవి రోజులా వ్యాపారానికి సంబంధించినవి కావు. లాభం తెచ్చిపెట్టలేని ఈ ఆలోచనలకి తన సమయం వృధా చేసే అలవాటు అతడికి లేదు.

యేదో మర్చి పోయానన్న భావన వుండి వుండి గుర్తుకు వస్తోంది. అది చాల ముఖ్యమైన విషయం అన్పిస్తోంది. యేమై వుంటుంది? అతడు ఆ రోజు జరిగిన సంఘటనలు వరుసగా నెమరు వేసుకున్నాడు.

మామూలుగా ఆరింటికే అలారం పెట్టుకున్నా ఫోను మ్రోగడంతో ఐదున్నరకే మెలుకువ వచ్చింది. క్రితం రాత్రి బుక్ చేసిన కాలే అది. ఆ తర్వాత నిద్ర పట్టలేదు. ఎనిమిదిన్నరకంతా ఆఫీసుకని కారెక్కాడు. అప్పటికి యింకా యెవరూ రాలేదు. దాదాపు రోజూ అంతే. స్టాఫ్ కంటే ముందుగా అతనే వెళ్తాడు. ఈ విషయంలో అతన్ని స్టాఫ్ తిట్టుకోవటం కూడా జరుగుతూ వుంటుంది. ఒక గంట సేపు ఏకాంతముగా నిశ్శబ్దంగా వున్న ఆ సమయంతో అతి ముఖ్యమైన ఫైల్సే చూస్తాడు. అతను సాధారణంగా తీసుకొనే నిర్ణయాలన్నీ ఆ సమయంలో తీసుకునేవే. పదింటికి సెక్రటరీని పిలిచి

## కొవ్వొత్తి

అల్లంత ఎత్తులో
అంతు తెలియని మత్తులో
అందుకోమని చేతులు చాస్తున్నది అందం
ఎగిరిన హృదయ పతంగం నిలువునా
కూలింది!
కూలితే అందం నవ్వుల్లో తేలియాడింది.
ఆ నవ్వులలో కరగాలని
ఆ కన్నులలో కాపురం పెట్టాలని
తరగని స్వప్నాల, దరిలేని తీరాల
చేరాలని అనుకున్నాను పిచ్చిగా నేను!
కానీ-
పెరిగిన ప్రేమకు పగిలిన నక్షత్రంలా
రాలిపోయాను
చెదరిన నా మనస్సు ప్రేమ ఎడారిలో
కాళ్ళు విరిగిన గుర్రంలా
ఎండమావులవైపు వెర్రిగా పరుగెత్తగా
కాలుతున్న కొవ్వొత్తి-నన్నుచూచి
కన్నీరు నింపుకొంది నిండుగా!

**షికారి శివకుమార్**

అర్జెంటు లెటర్స్ డిక్టేట్ చేసాడు. ఆ రోజు పదిన్నరకు ఒక అపాయింట్‌మెంట్ వుండింది. చాలా ముఖ్యమయిన పని.


ఆ రోజు టైమ్‌టేబుల్‌ను వరుసగా గుర్తు చేసుకుంటున్నాడు అతను. తన బావమరది రికమండేషన్ లెటర్‌తో ఒకతను వచ్చాడు. ఉద్యోగంకావాలట. పోస్ట్ గ్రాడ్యుయేట్ అయితే నేం చదువు వల్ల వచ్చే సహజమైనగుణాలేవిలేవు అతనిలో. మన్ను తిన్న పాములా తను అడిగిన వాటికి "అవును" "కాదు" తోటే సమాధానం యిచ్చాడు. తన బావమరిదికి చెప్పాలి యింకెప్పుడూ యిలాటి వారిని తన దగ్గరకు పంపవద్దు అని. మనిషిలోని అన్ని గుణాల కంటే ఆత్మస్థయిర్యానికి, నిజాయితీకి యెక్కువ విలువనిస్తాడు తను.

అతడు అసహనంగా పక్క మీద కదిలాడు. యెందుకిలా వుందీవేళ? యేదో ముఖ్యమైన విషయం మర్చిపోతే కాని యిలా వుండదు. అదేమిటో గుర్తుకు వస్తే గాని మనస్సుకి శాంతి వుండదు, నిద్ర పట్టదు. మళ్ళీ ఆలోచనలు

పదకొండున్నర నుండి పన్నెండున్నర వరకు మీటింగే. ఈ సంవత్సరం ప్రొడక్షన్ యింకా పెంచాలని తన తాపత్రయం. యెక్కువ ప్రొడక్షన్ అంటే యెక్కువ లాభాలు. అదేచెప్పాడు తన కిందివాళ్ళకు. మరింత కష్టపడాలన్నాడు. సరేనన్నారు వాళ్ళు. ఉత్సాహం, తెగువ వున్నవాళ్ళనే యెన్నుకుంటాడు తను.

అతను లేచి లైటు వేసాడు. ఈ రోజు తనకేమైంది? యేనాడూ యిలా నిద్ర పట్టకుండా బాధపడలేదు. తనని పీడిస్తున్న ఈ విషయం యేమిటో గుర్తు వచ్చే వరకు నిద్రపోలేదు.

యెవర్నయినా కలుసుకోవటం మర్చిపోయాడా? డైరీ తీసి ఆ రోజు అపాయింట్‌మెంట్స్ చూసుకున్నాడు. అందులో వ్రాసిన అందర్నీ కలుసుకున్నాడు. అన్నీ తనకు సానుకూలముగానే జరిగాయి. కానీ అసంపూర్తిగా యేదో మిగిలిపోయిన భావన. యే పనైనా సగంలో ఆపేయ




టం, అలా వదిలేయటం తనకేనాడు అలవాటు లేదు.

డైరీ మూసి లైటు తీసి అతను మళ్ళీ పక్క మీద వాలాడు. నిద్ర రాలేదు. కళ్ళు తెరిచి బెడ్ లైటు వెలుగులో సీలింగ్ ఫాన్ చూస్తు పడుకొన్న అతడికి హఠాత్తుగా చెప్పలేనంత దిగులుగా అన్పించింది.

యేమిటి జీవితం! యెందుకీ ఆరాటం పిడికెడు అన్నం మెతుకుల కోసమా? పిల్లలకు కాన్వెంటు కోసమా? భార్య శరీరం చుట్టు అందమైన చీర కోసమా? ఊహు... యివేవి గావు. డబ్బు సంపాదించటమే వ్యసనం. ఆ చదరంగం ఆడుతూనే వుండాలి. హోదా, పేరు ప్రతిష్టలు. సంఘంలో పరువు—

... యివేం విలువలు? ఈ శుష్క విలువల కోసమేనా తనింత కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నది?

లాభం లేదు. యెంత ప్రయత్నించినా తనకు కావలసినది తప్ప మిగతావన్ని గుర్తు వస్తున్నాయి. యేం మర్చిపోయాడు తాను?

బయట గుర్ఖా కాబోలు నేల మీద కర్ర తాటిస్తూ నడుస్తున్నాడు. కిటికీలో నుంచి వెన్నెల కిరణం ఒకటి గదిలో పడి మెరుస్తోంది. ఆ వెన్నెల వైపు చూస్తూ పడుకున్న అతడికి తను మర్చిపోయిన, అప్పటి వరకు మెదడు పొరలలో మెదులుతూ, ఆలోచనల కంధకుండా పూరించిన ఆ ముఖ్యమైన విషయం చప్పున స్ఫురించింది. సుషుప్తిలో జారుకుంటున్న అతను దిగ్గునలేచి కూర్చున్నాడు.

తరువాత నెమ్మదిగా పక్కకి — భార్య వైపు వంగాడు. ★